సంక్షేమ పథకం అందని కుటుంబం లేదు

పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): అర్హత ఉండి సంక్షేమ పథకం అందని కుటుంబం లేదని, సీఎం జగనన్న ఇచ్చిన స్థలం విలువతో కలుపుకుంటే ప్రతి కుటుంబానికి సుమారు రూ.10 లక్షల వరకు లబ్ధి చేకూరిందని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 38వ డివిజన్ 194వ వార్డ్ సచివాలయం పరిధిలో ఆయన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసాతో కలిసి గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆ కుటుంబానికి అందుతున్న పథకాల గురించి వివరించారు. వివరాలతో కూడిన బ్రోచర్‌ను అందచేస్తూ ముందుకు సాగారు. తమకు పథకాలు అందలేదని కొందరు అడగటంతో వారికి ఎందుకు రావడం లేదని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను ప్రశ్నించారు. వారు చెప్పిన కారణాలను ఆలకించి సాంకేతిక సమస్యలతో పథకాలు అందనివారి వివరాలను తీసుకుని వాటిని సరిచేసి తిరిగి దరఖాస్తు చే యించి తప్పనిసరిగా పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు.

కొండ ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి...

కొండ ప్రాంతం చివరి వరకు వెళ్లి స్థానికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని వెలంపల్లి తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చాక కొండ ప్రాంతంలో అనేక చోట్ల మెట్లు నిర్మించామని, మిగిలినవి కూడా త్వరితగతిన పూర్తి చెయ్యాలను అధికారులను ఆదేశించామని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో నగరాభివృద్ధికి చంద్రబాబు నిధులు కేటాయించలేదని తెలిపారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక అనేక దఫాలుగా నిధులు విడుదల చేయడమే కాకుండా కార్పొరేషన్ నిధులు సైతం సమకూర్చారని తెలిపారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ, 14 ఏళ్లు సీఎంగా చేశానని చెప్పుకుంటున్న చంద్రబాబు ఏనాడైనా పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని గానీ, చేయూత పథకం ద్వారా మహిళలకు చేయూత ఇవ్వాలనిగానీ ఆలోచన చేశారా అని ప్రశ్నించారు.

చెల్లని కాసు దేవినేని ఉమా...

రాష్ట్రాన్ని నాశనం చేయటానికి చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్‌లు కంకణం కట్టుకున్నారని ధ్వజమెత్తారు. గతంలో ప్రజలను ఎందుకు ఆదుకోలేదని నిలదీశారు. ఆస్తులను కబ్జా చేయటంలో టీడీపీ నాయకులది అందె వేసిన చెయ్యి అన్నారు. అదే కోవలో దేవినేని ఉమా గొల్లపూడిలో టీడీపీకి చెందిన ఒక వృద్ధురాలి స్థలాన్ని పార్టీ కార్యాలయం పేరుతో కబ్జా చేసేందుకు యత్నించాడని, అయితే అతని పన్నాగం బెడిసి కొట్టడంతో ఖంగుతిని వెనుకడుగు వేశాడని పేర్కొన్నారు. జూదం, తాగుడికి పార్టీ కార్యాలయాలను కేంద్రాలుగా చేసుకుంటున్న ఘనుడు దేవినేని ఉమ అన్నారు. చివరికి తన నియోజకవర్గంలోనే చెల్లని కాసుగా మిగిలిపోయాడని ఎద్దేవా చేశారు. పార్టీ నాయకులు షేక్ హయాత్ షరీఫ్, బొమ్ము మధు, షేక్ నజీర్, విజయ్, బొక్క శాంతి, విశ్వనాథ రవి, సంపర రాంబాబు, నీలవేణి, పోలిమెట్ల శరత్, కర్నాటి రాంబాబు, సచివాలయ అడ్మిన్, వెల్ఫేర్, శానిటరీ సెక్రటరీలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జేసీఎస్ కన్వీనర్లు సమన్వయంతో పని చేయాలి

గుంటూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల జేసీఎస్ కో–ఆర్డినేటర్ కందుల

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకే జేసీఎస్ కన్వీనర్లను నియమిస్తున్నట్లు గుంటూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల జేసీఎస్ కో–ఆర్డి నేటర్ కందుల రవీంద్రరెడ్డి తెలిపారు. కింది స్థాయి కార్యకర్త నుంచి నేరుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సంబంధాలు కలిగి ఉంటారన్నారు. రానున్న రోజుల్లో వలంటీర్లు, గృహ సారథులు, ప్రజలకు మధ్య జేసీఎస్ మండల కన్వీనర్లు వారధుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. గురువారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ భవానీపురంలోని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని నియోజకవర్గాలకు సంబంధించి జగనన్న సచివాలయ కన్వీనర్ (జేసీఎస్) సమావేశం జరిగింది. గుంటూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల జేసీఎస్ కో–ఆర్డి నేటర్ కందుల రవీంద్రరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాసరావు, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, మల్లాది విష్ణు, వసంత కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీలు ఎండీ రుహుల్లా, మొండితోక అరుణ్‌కుమార్, తూర్పు నియోజకవర్గ సమన్వయ కర్త దేవినేని అవినాష్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ తాతినేని పద్మావతి, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్(బుజ్జి), సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు కొడవల్లు నరసింహారావు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, నూతనంగా నియమితులైన జేసీఎస్ కన్వీనర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవీంద్రరెడ్డి మాట్లాడుతూ జేసీఎస్ కన్వీనర్ల విధులను వివరించారు. వలంటీర్లు, గృహ సారథులతో కలిసి సమన్వయంగా జేసీఎస్ మండల కన్వీనర్లు ముందుకు సాగాలన్నారు. జేసీఎస్ కన్వీనర్లు వారికి కేటాయించిన ప్రతి పనిని బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. ప్రతి అంశంలో జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమాచారాన్ని అందిపుచ్చుకుంటూ పార్టీ ఆదేశాలను స్పష్టంగా పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యమంత్రి నుంచి వచ్చే సమాచారాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లాల్సిన బాధ్యత జేసీఎస్ కన్వీనర్లపై ఉందన్నారు.

సమన్వయంతో ముందుకు సాగాలి..

రీజినల్ కో ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జేసీఎస్ కన్వీనర్లపై గురుతర బాధ్యతను పెట్టారన్నారు. గృహ సారథుల నియామకంలో జేసీఎస్ కన్వీనర్లు ఎమ్మెల్యేల సహకారం తీసుకోవాలని కోరారు. అందరినీ కలుపుకుని, ప్రతి అంశాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో మన పార్టీ ఎమ్మెల్యేలను గెలిపించడం ద్వారా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



సచివాలయ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న జగనన్న సచివాలయ కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

క్లుప్తంగా

విధుల్లో అప్రమత్తంగా ఉండండి



విజయవాడ స్పోర్ట్స్: సంఘ వ్యతిరేక శక్తుల కదలికల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇంటెలిజెన్స్ సిబ్బందికి జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా సూచించారు. ఏలూరు డీటీసీ కార్యాలయంలో నిర్వహించిన ఇంటెలిజెన్స్ శిక్షణ తరగతులకు జిల్లాలోని పలువురు సిబ్బంది, అధికారులు హాజరయ్యారు. ఈ శిక్షణ తరగతులకు వెళ్లిన సిబ్బంది వారు తయారు చేసిన పలు ఐఈడీ నమూనాలను స్థానిక బందరు రోడ్డులోని వ్యాస్ కాంప్లెక్స్‌లో గురువారం ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సీపీ రాణా మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న చట్ట వ్యతిరేక కార్యకలాపాలను గుర్తించేందుకు చిత్తశుద్ధి, అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ప్రధానంగా వాహన తనిఖీల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. బాంబ్ డిస్పోజల్ టీంలోకి మొట్టమొదటి సారిగా ఎనిమిది మంది మహిళలు చేరడం అభినందనీయమన్నారు. అనంతరం శిక్షణ తీసుకున్న సిబ్బందికి జ్ఞాపికలు అందజేశారు. ఐఎస్‌డబ్ల్యూ రిటైర్డ్ ఐజీపీ శశిధర్‌రెడ్డి, సీఎం సెక్యూరిటీ వింగ్ ఎస్పీ సి.హెచ్.అప్పలనాయుడు, ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీలు సూర్యభాస్కరరెడ్డి, సుబ్రహ్మణ్యస్వామి పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో మాఘమాస ప్రత్యేక పూజలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఈ నెల 22వ తేదీ నుంచి మాఘమాస ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. విశేష పర్వదినాలతో పాటు ఆదివారాలు సూర్యోపాసన సేవ చేస్తారు. 22వ తేదీ మాఘశుద్ధ పాడ్యమి ఆదివారం, 28వ తేదీ శనివారం రథసప్తమి, 29వ తేదీ ఆదివారం మాఘ శుద్ధ అష్టమి, ఫిబ్రవరి 1వ తేదీ బుధవారం భీష్మ ఏకాదశి, 5వ తేదీ ఆదివారం మాఘ పౌర్ణమి, 12వ తేదీ ఆదివారం మాఘ బహుళ సప్తమి, 16వ తేదీ గురువారం మాఘ బహుళ ఏకాదశి, 19వ తేదీ ఆదివారం సూర్యోపాసన జరుగుతుంది. రూ. 1000 టికెట్లు కొనుగోలు చేసే భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగానూ ఈ సేవలో పాల్గొనవచ్చు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని నటరాజ స్వామి వారి ఆలయం కళావేదిక వద్ద ఈ సేవ నిర్వహిస్తారు. టికెట్లను దేవస్థాన ఆర్జిత సేవా టికెట్ల కౌంటర్‌తో పాటు ఆన్‌లైన్‌లోనూ పొందవచ్చు.

కానిస్టేబుల్ రాత పరీక్షకు పటిష్ట బందోబస్తు



వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో సిబ్బందికి సూచనలిస్తున్న డీసీపీ సత్తిబాబు

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు(ఏపీఎస్‌ఎల్‌పీఆర్‌బీ) ఈ నెల 22వ తేదీన నిర్వహించే కానిస్టేబుల్ ఉద్యోగాల రాత పరీక్షను ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు చేసినట్లు అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు తెలిపారు. కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రశ్నాపత్రాలు భద్రపర్చిన స్ట్రాంగ్ రూంను డీసీపీ గురువారం పరిశీలించారు. ఎన్టీఆర్ జిల్లాలోని పరీక్షా కేంద్రాలకు తరలించే ప్రశ్నాపత్రాలను ఇక్కడ భద్రపర్చినట్లు చెప్పారు. స్ట్రాంగ్ రూం వద్ద ఉన్న సీసీ కెమెరాలను తనిఖీ చేశారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా పరీక్షలు ప్రశాంతంగా సాగేందుకు పూర్తి భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదేవిధంగా కంచికచర్ల పోలీస్ స్టేషన్ నందు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంను డీసీపీ మేరీ ప్రశాంతి పరిశీలించారు. విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అక్కడున్న ఆర్మ్‌డ్ పోలీసులను ఆమె ఆదేశించారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆటోనగర్(విజయవాడ తూర్పు): ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన భారతీనగర్ సమీపంలోని హైటెన్షన్ రోడ్డులో గురువారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రామవరప్పాడుకు చెందిన మోడే నికిల్, యనమలకుదురుకు చెందిన వంగపండు వాసవి తీవ్రంగా గాయపడ్డారు. నికిల్ తన బైక్‌పై భారతీనగర్ హైటెన్షన్ రోడ్డు విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో వస్తుండగా ఇదే దారిలో మహానాడు రోడ్డు నుంచి వాసవి అనే మహిళ వస్తున్న వాహనాన్ని ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో నికిల్ ఎడమ చేయి విరిగింది. వాసవి కంటి పై భాగంలో గాయమైంది. ఈమె బ్యాంక్ ఆఫ్ బరోడాలో అసిస్టెంట్ మేనేజర్ గా పనిచేస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చికిత్స పొందుతున్న వాసవి



చికిత్స పొందుతున్న నికిల్

ముస్లిం మైనార్టీలకు ప్రభుత్వం అండ

మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆసిఫ్



ఖాదర్‌బాషాను సత్కరిస్తున్న ఆసిఫ్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటుందని ఏపీ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ అన్నారు. ఇటీవల ఉమ్రా యాత్ర చేసిన ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషాను, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా మరోసారి నియమించిన సందర్భంగా ఆసిఫ్ ఆధ్వర్యంలో పలువురు మైనార్టీ నేతలు ఆయనను వక్ఫ్‌బోర్డు రాష్ట్ర కార్యాలయంలో గురువారం కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం ఇవ్వనటువంటి సంక్షేమ కార్యక్రమాలను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తుందన్నారు. విద్యావైద్య రంగాలకు సంబంధించి విప్లవాత్మకమైన సంస్కరణలు చేపట్టారని వివరించారు. ఖాదర్‌బాషా నాయకత్వంలో ముస్లిం మైనార్టీలకు మరింత మేలు జరగాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. పార్టీ మైనార్టీ నాయకులు ఆబిద్, మీర్‌హుస్సేన్, అన్సారీ, రఫీ, యునాస్ తదితరులు పాల్గొన్నారు.

28న రథసప్తమికి విశేష పూజలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): 28న రథసప్తమిని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. 28వ తేదీ శనివారం ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, అనంతరం విశేష అభిషేకాలు, అలంకరణ అనంతరం ఆలయ ఆస్థాన కల్యాణ మండపంలో స్వామి వారికి తులసీ దళ అర్చన జరుగుతుందన్నారు. ఉదయం అశ్వరథంపై స్వామి వారు కొలువై ఆలయం చుట్టూ ఏడు పర్యాయాలు ప్రదక్షిణలు ఉంటాయని పేర్కొన్నారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు పాయసంను ప్రసాదంగా అందిస్తామని తెలిపారు. భక్తుల రద్దీ నేపథ్యంలో స్వామి వారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలుకుండా ఉండేలా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ళ హనుమంతరావు పేర్కొన్నారు.

భర్త అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన భర్త కనిపించడం లేదంటూ వివాహిత కొత్తపేట పోలీసులకు గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొత్తపేట శ్రీనివాసమహల్ ప్రాంతానికి చెందిన పిళ్లా రామారావు (47), లక్ష్మీ భార్యాభర్తలు. వీరికి ముగ్గురు కుమార్తెలు కాగా పెద్ద కుమార్తెకు వివాహం అయింది. రామారావు బీసెంట్ రోడ్డులో బట్టల వ్యాపారం చేస్తుంటాడు. గురువారం ఉదయం చిన్న కుమార్తె తేజశ్రీని రాజకుమారి థియేటర్ వద్ద స్కూల్లో దింపి వస్తానని వెళ్లిన రామారావు కుమార్తెను కేబీఎన్ కాలేజీ వద్ద ఆటో ఎక్కించి బయటకు వెళ్లాడు. ఆ తర్వాత నుంచి రామారావు ఆచూకీ లేకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రణదీవెనగర్‌లో సర్వే



కృష్ణలంక(విజయవాడతూర్పు): కరకట్ట దిగువ ప్రాంతం వారధి నుంచి పద్మావతి ఘాట్ వరకు రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్న నేపథ్యంలో రణదీవెనగర్‌లో గురువారం రెవెన్యూ అధికారులు ఎన్యుమరేషన్ సర్వే నిర్వహించారు. డివిజన్ పర్యటనలో భాగంగా స్థానిక కార్పొరేటర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు రణదీవెనగర్‌లో పర్యటించి సర్వేను పరిశీలించి స్థానిక ప్రజలకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ ప్రజలందరూ అధికారులకు సహకరించాలని కోరారు.

మైనార్టీలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌మొహిద్దీన్

వించిపేట(విజయవాడపశ్చిమ): సినీ నటుడు, వైఎస్సార్ సీపీ మైనార్టీ నేత అలీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన నాయకుడు పోతిన మహేష్ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ గౌస్‌మొహిద్దీన్ గురువారం ఒక ప్రకటలో డిమాండ్ చేశాడు. బీజేపీతో అంటకాగుతూ ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో ఉన్న జనసేన నేతలకు మైనార్టీలంటే చిన్న చూపుతో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ మైనార్టీ నాయకుడు అలీ పవన్ కళ్యాణ్‌పై పోటీ చేస్తానని ప్రకటిస్తే అందులో తప్పేముందని ప్రశ్నించారు. దానికి అలీ బఫూన్ అంటు జనసేనా నాయకుడు పోతిన మహేష్ నోటికి వచ్చినట్లు మాట్లాడి మైనార్టీల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యానించాడని ఆగ్రహం వ్యక్తం చేశాడు. రాష్ట్రంలో మైనార్టీలకు పెద్ద పీట వేస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమే అన్నారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేనా పార్టీ ఒక్క మైనార్టీకి కూడా సీటు ఇవ్వలేదని తెలిపారు. మైనార్టీలంతా వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారని, పోతిన మహేష్ నోరు అదుపులో పెట్టుకోకపోతే వారే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

గొప్ప తత్వవేత్త యోగి వేమన



మాట్లాడుతున్న ఆర్ఎం ఏసుదానం

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): కవి, తత్వవేత్త యోగి వేమన జయంతి గురువారం పండిట్ నెహ్రూ బస్టేషన్‌లో ఘనంగా నిర్వహించారు. డెప్యూటీ సీటీఎం బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి ఎం. ఏసుదానం మాట్లాడుతూ కవిగా, తత్వవేతగా, సమాజంలో అసమానతలను ఎత్తిచూపిన వ్యక్తి యోగి వేమన అని కొనియాడారు. అయన జయంతి ఉత్సవాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

సామాజిక సంఘ సంస్కర్త వేమన

విజయవాడ స్పోర్ట్స్: పద్యాలతో సమాజంలోని మూఢాచారాల నిర్మూలనకు యోగి వేమన కృషి చేశారని అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు అన్నారు. యోగి వేమన జయంతి జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో గురువారం నిర్వహించారు. యోగి వేమన చిత్రపటానికి సత్తిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సరళమైన భాషలో పద్యాలను ఆలపిస్తూ యోగి వేమన సామాజిక విప్లవానికి నాంది పలికిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. ప్రజాకవిగా వేమన గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. అలాంటి మహనీయుడి జయంతిని రాష్ట్ర వేడుకగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. వేమనను భావితరాలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యాలయ ఏవో రంగారావు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



యోగి వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీసీపీ సత్తిబాబు

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం

ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

భవానీపురం(విజయవాడపశ్చిమ): మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఇబీ) భవానీపురం స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాస్ తెలిపారు. డీసీపీ మోకా సత్తిబాబు ఆదేశాల మేరకు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై భవానీపురంలోని నారాయణ జూనియర్ కాలేజి విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ చెడు స్నేహాల వలన మత్తు పదార్థాలకు అలవాటుపడుతున్న విద్యార్థులు తమ భవిష్యత్‌ను తామే చేతులారా నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల దైనందిన ప్రవర్తన, అలవాట్లను నిశితంగా పరిశీలిస్తుండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం సమాజంలో అతి పెద్ద సమస్యగా మారిందని, ముఖ్యంగా యువత వాటి బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత అటు తల్లిదండ్రులు, ఇటు అధ్యాపకులపై ఉందన్నారు. మాదక ద్రవ్యాల అమ్మకాలు, వినియోగం వంటివి గుర్తిస్తే 14500 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. డ్రగ్స్ వాడకాన్ని అరికట్టేందుకు విద్యార్థులు సహకరించాలని కోరారు.

ఎల్ఐసీని ప్రైవేటీకరిస్తే దేశంపై ఆర్థిక భారం



నిరసన తెలుపుతున్న ఐసీఈయు నాయకులు, ఉద్యోగులు

గాంధీనగర్(విజయవాడపశ్చిమ): ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసీని ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్న కేంద్రం ఇప్పటికైనా తన ప్రయత్నాన్ని విరమించుకోవాలని ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి ఎస్ఎంకె ప్రసాద్ అన్నారు. ఎల్ఐసీని ప్రైవేటీకరణ చేస్తే దేశంపై ఆర్థిక భారం పడుతుందని హెచ్చరించారు. 1956 జనవరి 19న నాటి కేంద్ర ప్రభుత్వం 245 ప్రైవేట్ కంపెనీలను జాతీయం చేస్తూ ఆర్డినెన్స్ ప్రకటించిన రోజును పురస్కరించుకుని 'ప్రజల ధనం..ప్రజల కోసమే' అన్న నినాదంతో భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోగల రెండు ఎల్ఐసీ కార్యాలయాల్లో గురువారం మధ్యాహ్న భోజన విరామం సమయంలో కేంద్రం తీరును వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 67 ఏళ్లగా ప్రజల విశ్వాసాన్ని పొంది ప్రతి ఏడాది సుమారుగా రూ.31 వేల కోట్లను డివిడెండ్‌గా ప్రభుత్వానికి చెల్లిస్తుందని అన్నారు. ఎల్ఐసీని ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ పేరుతో షేర్ మార్కెట్‌లో ప్రవేశపెట్టి నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న యత్నాన్ని ఆలిండియా ఇన్స్యూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తరుపున ఖండిస్తున్నామని చెప్పారు. ఐసీఈయు అధ్యక్షులు వీవీఎస్ఎస్ సాయి, ఆర్‌వీ శ్రీనివాసరావు, కార్యదర్శులు గుర్రం శ్రీనివాస్, రాజశేఖర్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీపీ మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి

కేంద్ర ప్రభుత్వానికి కేసన డిమాండ్



మాట్లాడుతున్న కేసన శంకరరావు, ఇతర ప్రతినిధులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): బలహీనవర్గాలు అభ్యున్నతి చెందాలంటే కేంద్ర ప్రభుత్వం బీపీ మండల్ కమిషన్ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరంలోని తమ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో 1977లో జనతా పార్టీ ఎన్నికల్లో విజయం సాధిస్తే బీసీల సామాజిక, రాజకీయ, సంక్షేమ, సమగ్ర అభివృద్ధి కోసం ఒక కమిషన్ వేస్తామన్న ఎన్నికల వాగ్దానం మేరకు నలుగురు సభ్యులతో బీపీ మండల్ చైర్మన్‌గా మండల్ కమిషన్ వేసినట్లు తెలిపారు. సామాజికంగా, విద్యాపరంగా 11 సూచికల ఆధారంగా బీసీల వెనుకబాటు తనాన్ని గుర్తించేందుకు రెండేళ్ల పాటు, సుమారు 406 జిల్లాల్లో పర్యటనలు జరిపి అద్వితీయమైన రిపోర్టును డిసెంబరు 31, 1980లో నాటి ప్రధాని ఇందిరాగాంధీకి ఇచ్చినట్లు తెలిపారు. ఆ రిపోర్టును పదేళ్లు అటకెక్కించగా, మళ్లీ 1989లో వీపీ సింగ్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మరుగున పడిన మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని నిర్వహించినట్లు తెలిపారు. అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు పార్లమెంటులో ప్రకటన చేసినట్లు తెలిపారు. మండల్ కమిషన్ చేసిన సిఫార్సులన్నింటినీ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్కాపురం కనకారావు, ఉద్యోగ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, నాయకులు దాసరి కేశవరావు, యువజన ఉపాధ్యక్షుడు జి.ద్వారకాశ్రీను, చిప్పాడ చందు తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువుకు పేస్ మేకర్



కోలుకున్న శిశువుతో ఆస్పత్రి వైద్యుల బృందం

లబ్బీపేట(విజయవాడతూర్పు): నవజాత శిశువు హృదయ స్పందన అబ్‌నార్మల్‌గా ఉండగా క్రమబద్దీకరించేందుకు వైద్యులు తాత్కాలిక పేస్‌మేకర్ అమర్చారు. గర్భం దాల్చిన 29 వారాలకు జన్మించిన 900 గ్రాముల బరువున్న శిశువు రెండున్నర నెలల తర్వాత బరువు పెరగడంతో శాశ్వత పేస్ మేకర్ అమర్చినట్లు వైద్యం అందించిన రెయిన్‌బో ఆస్పత్రి నియోనాటాలజిస్ట్ డాక్టర్ రామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరంలోని తమ ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గర్భిణీ 27వ వారంలో పరీక్షకోసం రాగా, ఫీటల్ నిపుణురాలు డాక్టర్ సుమలత పరీక్షించి గర్భస్థ శిశువు హార్ట్‌బీట్‌లో తేడా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. రెండు వారాల తర్వాత హృదయ స్పందన తేడా రావడంతో అత్యవసరంగా సిజేరియన్ చేయగా, కవలలకు జన్మనిచ్చినట్లు తెలిపారు. వారిలో 900 గ్రాముల బరువున్న శిశువుకు తాత్కాలిక ఫేస్‌మేకర్ అమర్చి హార్ట్ రేట్‌ను క్రమబద్దీకరించినట్లు తెలిపారు. రెండున్నర నెలలకు 3 కిలోలకు బరువు పెరగడంతో శాశ్వత ఫేస్‌మేకర్ అమర్చి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆస్పత్రి వైద్యులు ఉమా మిక్కిలినేని, డాక్టర్ జ్యోతి ప్రకాష్ రెడ్డి, డాక్టర్ భరత్‌సిద్ధార్థ్, డాక్టర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాశాఖ ప్రతిష్టకు భంగం కలిగిస్తే సహించం

విజయవాడ స్పోర్ట్స్: నిరాధారమైన ఆరోపణలతో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్)పై అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని, అలాంటి వార్తా సంస్థలపై న్యాయపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శాప్ వీసీ, ఎండీ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర క్రీడా శాఖ ప్రతిష్టకు భంగం కలించేలా పత్రికల్లో (సాక్షి కాదు) ప్రచురించిన వార్తలను ఆయన ఖండించారు. కార్యాలయంలోని మహిళా ఉద్యోగులను అధికారులు లైంగికంగా వేధిస్తున్నారంటూ వెలువడిన వార్తల్లో వాస్తవం లేదన్నారు. ఆకాశ రామన్న ఉత్తరాలతో క్రీడాశాఖపై నిందలు మోపుతూ వార్తలు ప్రచురించడం ఏ మాత్రం తగదన్నారు. శాప్ కార్యాలయంలో గతంలో అవినీతి అక్రమాలపై ప్రస్తుతం విచారణ జరుగుతోందని గుర్తు చేశారు. దీనిని పక్కదారి పట్టించేందుకు కార్యాలయంలోని అవినీతి అధికారులకు క్రీడా సంఘం ముసుగులో ఉన్న ఓ వ్యక్తి కుమ్మక్కై ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే ఈ అసత్య ప్రచారాలకు ఒడిగట్టారని వెల్లడించారు. గతంలోనూ కబడ్డీ జట్ల ఎంపికను సదరు క్రీడా సంఘం నాయకుడు పిచ్చి ఆరోపణలతో తన స్వలాభం కోసం పక్కదారి పట్టించేందుకు ఇదే మీడియా సంస్థను వాడుకున్నారని గుర్తు చేశారు. నిజానిజాలు పరిశీలించుకోకుండా వార్తలను ప్రచురించి తమ శాఖ ప్రతిష్టకు భంగం కలిగించిన సదరు మీడియా సంస్థ వెంటనే క్షమాపణ చెప్పాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.